**కాకాని చక్రపాణి**

నవలలు/ నవలికలు

సంపుటం–5

# నిప్పు

ఎమెస్కో

# 1

"గుంటూరు ఫోను చేసినా. నువ్వీ రుండావనరి! సినిమా తీయాలని మనసు పోయినాది. మా యాడది మరీ పట్టుబడతా ఉంది. ఆ పెయత్నంలో ఈడ కొచ్చుండాము. మా ఊరోడు గుర్నాతం ఓ రైట్రు అట్టుకొచ్చినాడు. ఆడ్ని నువ్వు సెలక్టు చెయ్యాల, సాయంత్రం ఐదు గంటల కోపాలి ఈడకు రా!" అని నే నున్న హోటలుకు ఫోను చేశాడు మర్రిమాను మర్కటయ్య.

"ఎక్కడికి?" అని అడిగాను.

"అదేందిరా ఆ పేరు... ఆc, అశోకా ఓటలంట. ఆడకు రా!"

"సరే!"

మర్కటయ్యది అసలు ఊరు నెల్లూరయినా గుంటూరులో సెటిలయ్యాడు. పెద్దగా చదువుకోలేదు గానీ, లోకజ్ఞానం బాగా ఉంది. చిన్నచిన్న వ్యాపారాలతో ప్రారంభించి పైకెదిగినవాడతను. అరవయిల్లో కాబోలు, గుంటూరులో పొగాకు కంపెనీ పెట్టాడు. బాగానే లాభాలు గడించాడు. పొగాకు వ్యాపారం పడిపోవటం ముందుగా గమనించినవాడు మర్కటయ్యే. వక్కపొడి, సిమెంటు, డిటెర్జంట్ పౌడర్లు ఒకటేమిటి... అతను చెయ్యని వ్యాపారం లేదు. ఈ మధ్య ఓ సాఫ్ట్‌వేర్ సంస్థను కూడా ప్రారంభించాడట తొంభై ఐదులో కాబోలు ఓసారి నాతో అన్నాడు. "ఈ యగసాయోత్పత్తులతో యాపారం సరిగ్గా ఉండదయ్యా! యగసాయం అంటే ఏంది? నీటి మీద ఆధారపడుద్ది. వాన ఎక్కువ కుర్సినా తంటానే, తక్కువ కుర్సినా తంటానే. పైగా చీడపురుగల బాధ. ఈట్నొదిలేసి గాలితో యాపారం చెయ్యాలని ఉందయ్యా!" అని. అందుకే కాబోలు సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రారంభించాడు. సినిమా తీయాలన్న ఆలోచన కూడా అందులో భాగమేనేమో.

ఏళ్ల క్రితం ఛార్టెర్డ్ అకౌంటెంట్‌గా నాకతనితో పరిచయమైంది. మొదట్లో తిక్కమనిషి అనిపించినా, త్వరలోనే అతను ష్రూడ్ బిజినెస్‌మాన్ అని గ్రహించగలిగాను. అతనూ ఓ వ్యక్తితో స్నేహం చేశాక విడిచిపెట్టే తత్త్వమున్న మనిషి

కాదు. పైగా, నేను రచయితనన్న గౌరవం కూడా అతనికి ఉంది. అందుకే తన సినిమాకు కథ రాయటానికి రైటర్‌ను నేను ఎంపిక చేయాలని పిల్చినట్టున్నాడు. అతనికి నలభై ఐదేళ్ల వయసులో భార్య పోయింది. ఆ తర్వాత రెండు మూడేళ్లకు కాబోలు రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్యవల్ల అతనికి ఓ కూతురూ, కొడుకూ కలిగారు. అల్లుడు ఇలా రెండో పెళ్లి చేసుకున్నాక, తన కూతురు పిల్లల్ని సవతి తల్లి సరిగ్గా సాకుతుందన్న నమ్మకం లేక అతని మామగారు వాళ్లని తన ఇంటికి తీసుకువెళ్లాడు. బహుశః ఆ రెండో భార్య ప్రోద్బలం వల్లనే అతను సినిమా తియ్యాలని నిర్ణయించుకుని ఉండవచ్చు.

ఆరోజు సాయంత్రం ఐదు గంటలకు అశోకా హోటలుకు వెళ్లాను. సోఫాలో అతని పక్కన అతని భార్య కాబోలు కూర్చుని ఉంది. ఇంకో పాతికేళ్ల యువకుడు కూడా కూర్చుని ఉన్నాడు.

"మానిక్యం... మా యాడది. ఈడు దాని తమ్ముడు తిరుపాలు!" అని నాకు వాళ్లని పరిచయం చేస్తూ, "ఇంక తప్పలేదు, పానయ్యా! మా యాడదీ పట్టుబడతావుంది. సినిమా తీసినట్టయినా సరే, లేకపోతే కన్నారింటికి పోతానంటాంది. అందుకని గట్టి నిచ్చయం చేసుకొచ్చినాను. మన యాపారాలన్నీ బాగానే నడుస్తావుండాయి. ఇయాళదాకా మనం పట్టింది బంగారమే అయినాది. ఈ సినిమా కతేందో చూద్దామనిపించింది. పోతే పొయ్యి, ఓ యాభై లచ్చలు. రా, కూర్చో! మా గుర్నాతం ఆ రైట్రును అట్టుకు రావటాని కెళ్లినాడు. ఆ డెట్టాంటి మనిషో, రాయగల సత్తా ఉన్నవాడో, లేదో నువ్వు తేల్చాల!" అన్నాడు.

మర్కటయ్య కాఫీ తెప్పించాడు. మేం కాఫీ తాగుతున్న సమయంలో వాళ్లు వచ్చారు.

"ఈడే గురునాథం. నీ పేరేందయ్యా?" అనడిగాడు మర్కటయ్య, సోఫా చూపిస్తూ.

"అసలు పేరు రాజు. 'బాటసారి' అన్న పెన్‌నేమ్‌తో రచనలు చేస్తూంటానండి!" అన్నాడతను.

అతనికి ముప్పై ఏళ్లుంటాయేమో. మనిషి సన్నగా; పొడుగ్గా ఉన్నాడు. కళ్లద్దాలలో నుండి అతని చూపు నిశితంగా కనిపిస్తోంది. పక్కపాపిడి జుట్టు నెత్తిమీద కుదురుగా పర్చుకుని ఉంది. అతను నాకు తెల్సు. అతని రచనలంతకుముందు చదివాను. మంచి రచయితే అతను. అయితే, మనిషిని చూట్టం నాకిదే మొదటిసారి. నన్ను

పరిచయం చేశాడు మర్కటయ్య అతనికి. “వారు నాకు తెల్సు!” అన్నాడతను, నమస్కారం చేస్తూ. భేషజం లేని మనిషని అతన్ని చూడగానే నాకనిపించింది.

“మా ఫ్రెండు. మంచి రచయిత. కథలూ, కవితలూ రాస్తూంటాడు. మా బాబాయి సినిమాకు మావాడే కథ రాయాలని పట్టుబట్టి తీసుకొచ్చాను!” అని చెప్పాడు గుర్నాథం.

“సరే, ఏ కతలు రాసినావయ్యా నువ్వు? పేపర్లో అచ్చయినయ్యా?” అడిగాడు మర్కటయ్య చుట్టముట్టించి.

“ఏం కథలంటే ఏం చెప్పమంటారు? అన్ని రకాల కథలూ రాశాను. సుమారుగా ఓ వంద కథలు రాశాను. నాలుగు నవలలూ అచ్చయ్యాయి.”

“అట్టాగా! మంచిది. నిన్నూ ట్రై చేస్తాం. మాటిచ్చేశాననుకోమాక. నీ కథ మాకు నచ్చాలి. ఇంకో యిషయం. మాది లో బడ్జెట్ చిత్రం. మొదటి పిక్చరు. మా ఆడదాని పోరు పడలేకగానీ, లాపోతే నే నీ పని పెట్టుకునేటోడిని కాను. నీకూ ఇది మొదటి ఛాన్సే గదా! డబ్బెక్కువ ఇస్తానని ఆశ పెట్టుకోమాక. ఏదో నా ఓపినంత. మామొదటి పిక్చరు సక్సెసయితే, రెండో పిక్చరుకూ కత నువ్వే రాద్దువు. అప్పుడు నువ్వడిగినంత ఇస్తా!”

“మావాడు డబ్బు వస్తోంది కదా అని ఏ చెత్తబడితే ఆ చెత్త రాయడు, బాబాయి! వాడికి ఉన్నతాదర్శాలూ, ఆశయాలూ గట్రా చాలా ఉన్నాయి. డబ్బుదేవుంది. పేరు రావాలి గానీ! నీ పిక్చరు సక్సెసయితే నువ్వు మాత్రం మా వాడిని వట్టిగా పంపుతావా, బాబాయి!” అన్నాడు గుర్నాథం.

“సరే, సూద్దాంలే! చూడు, రైట్రూ! నీ బుర్రలో కతేదైనా ఉంటే సెప్పరాదూ?”

“ముందు మీ రెలాంటి పిక్చరు తీయాలనుకుంటున్నారో చెప్పండి!” అన్నాడు బాటసారి.

“ఏందెహె? అందరూ తీసేలాంటిదే!”

“అది కాదు. పౌరాణికమా, సాంఘికమా, డిటెక్టివ్ క్రైమ్ పిక్చరా, సెక్స్ పిక్చరా, దయ్యాలూ భూతాలు సినిమానా... ఏదో చెప్పకపోతే ఎలా?”

“ఇట్టాంటి యిషయాలు ఈయ్నకు సరిగ్గా తెలవవు. నేను చెప్తాను వినుకోవయ్యా, అన్నీ కలిపి తియ్యాల. దానికనువైన కత సెప్పు!” అంది మర్కటయ్య భార్య మాణిక్యం.

“పౌరాణికం, సాంఘికం ఎట్టా కలుపుతామండీ?” అన్నాడతను.